

ముగిసిన నూకాంబిక కొత్త అమావాస్య జాతర

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. బాలాలయంలో అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవ ప్రత్యేకాధికారి కె.శోభారాణి, ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను.. భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టారు. సాయంత్రం 4.30 గంటలకు అమ్మవారికి అమావాస్య పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయాన్ని తెరుస్తారు.



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులు

పల్లెల్లోనూ నిఘా నేత్రాలు

నేరాలు, అల్లర్ల నియంత్రణ దిశగా పోలీసులు అడుగులు

ప్రతి పంచాయతీలో కనీస నాలుగు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు



- ప్రజాప్రతినిధులు, నాయకులకు పోలీసుల అవగాహన
- ఉత్సవాల అనుమతులకు.. సీసీ కెమెరాలతో లింకు



చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



ఖండేపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



గాంధీగ్రామంలో ఓ వీధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

చోడవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):

గ్రామాల్లో నిఘా నేత్రాల ఏర్పాటు దిశగా పోలీసులు అడుగులు వేస్తున్నారు. ప్రశాంతతకు నిలయమైన ఉండే గ్రామాల్లో క్రమేపీ అటువంటి వాతావరణం తగ్గుతుండడం, మద్యం మత్తులో గొడవపడి, కొట్లాటకు దిగుతున్న ఘటనలు పెరగడం, చోరీలు, ఇతర నేరాలు అధికం కావడంతో గ్రామాల్లో పల్లెల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. ప్రతి గ్రామంలో ముఖ్యమైన ప్రదేశాల్లో కనీసం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచిస్తున్నారు. చోడవరం మండలంలో వెంకన్నపాలెం, రాయపురాజుపేట, నరసయ్యపేట, ఖండేపల్లి, కన్నంపాలెం పంచాయతీల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, మిగిలిన పంచాయతీల్లో సైతం ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు.

చోడవరం పోలీసు సర్కిల్ పరిధిలోని లక్కవరం గ్రామంలో ఇటీవల ఓ వృద్ధురాలిని బంగారం కోసం ఓ యువకుడు దారుణంగా పొడిచి చంపాడు. గోవాడలో సైతం బంగారం కోసం హత్య జరిగింది. ఇంకా పీఎస్‌పేట, చోడవరంలోని బాలాజీనగర్, శేమునాపల్లి, తదితర గ్రామాల్లో చోరీలు జరిగాయి. మరో వైపు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి తాగడం వంటివి అధకం అయ్యాయి. ఈ క్రమంలో మందుబాబుల మధ్య మాటా మాటాపెరిగి గొడవలు, కొట్లాటలు జరుగుతున్నాయి. యువకులు బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు. లక్కవరంలో వృద్ధురాలి హత్య కేసును ఛేదించి, నిందితుడిని గుర్తించడానికి పోలీసులు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. ఏకంగా నాలుగు పోలీసు బృందాలు, నెల రోజులకుపైగా కష్టపడ్డారు. ఘటన జరిగిన ప్రాంతంలో, గవరవరం వద్ద ఓ దుకాణ దారుడు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాతోపాటు, చోడవరం సమీపంలోని రేవళ్ల వద్ద ఓ నేత ఇంటివద్ద ఉన్న సీసీ కెమెరా వల్ల నిందితుడు ఎవరనేది పోలీసులు గుర్తించగలిగారు. దీంతో గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉంటే నేరస్థులను ... మిగతా 6వ పేజీలో

సీసీ కెమెరాలతో పలు విధాలా మేలు



సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల గ్రామాల్లో శాంతిభద్రతలు మెరుగుపడతాయి. దొంగల సంచారం తగ్గుతుంది. మందుబాబులు అనవసరంగా గొడవలకు దిగరు. మొత్తం మీద నేరాలు తగ్గుతాయి. ఒక వేళ నేరాలు జరిగినా.. నిందితులను గుర్తించి త్వరగా పట్టుకోవడానికి వీలవుతుంది. చోడవరం పట్టణంలో మా సొంత సొమ్ముతో 20 కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకుని వచ్చాం. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం.

సీఐ పి.అప్పలరాజు, చోడవరం

నేడే మేయర్ ఎన్నిక

ఉదయం 11 గంటలకు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- ఎన్నికల అధికారిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్
- మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నిక లాంఛనమే
- అనంతరం బాధ్యతల స్వీకరణకు ఏర్పాట్లు



పీలా శ్రీనివాసరావుకు బీఫాం అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) నూతన మేయర్ ఎన్నిక సోమవారం జరగనున్నది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన మేయర్ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందుకోసం జీవీఎంసీ పరిధిలోని 97 మంది కార్పొరేటర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుల హోదాలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ముగ్గురు ఎమ్మెల్సీలకు ముందస్తు సమాచారం అందజేశారు.

పీలా ఎన్నిక లాంఛనమే...

జీవీఎంసీ మేయర్‌గా 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు పేరు ఖరారయింది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆదివారం బీఫాం అందజేశారు. ఈ నేపథ్యంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం లాంఛనమేనని కూటమి నేతలు చెబుతున్నారు. ఉదయం 11 గంటలకు జవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. సమావేశం ప్రారంభం కాగానే మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు పేరును ఒక కార్పొరేటర్ ప్రతిపాదిస్తారు. దానిని కూటమి భాగస్వామ్య పార్టీకి చెందిన మరో కార్పొరేటర్ బలపరుస్తారు. దీనిపై ఎన్నికల అధికారి హోదాలో జేసీ మయూర్ అశోక్ ఓటింగ్ నిర్వహిస్తారు. జీవీఎంసీలో కూటమికి 63 మంది కార్పొరేటర్లతో పాటు 11 మంది ఎక్స్ అఫీషియోసభ్యుల బలం ఉంది. మేయర్ ఎన్నికకు జీవీఎంసీ మొత్తం సభ్యుల్లో సగం మంది మద్దతు ఉంటే సరిపోతుంది ఈ నేపథ్యంలో పీలా శ్రీనివాసరావు ఎన్నిక లాంఛనమే. మేయర్‌గా ఎన్నికైన వెంటనే పీలా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించాలని నిర్ణయించుకోవడంతో అతని ప్రమాణ స్వీకారానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఇదిలా వుండగా మేయర్ ఎన్నిక ప్రక్రియను బహిష్కరిస్తున్నట్టు వైసీపీ కార్పొరేటర్లు ప్రకటించారు.

మాంసం తూకంలో మోసం

కిలోకు వంద గ్రాములు తక్కువ వచ్చేలా కాటాల్లో సెట్టింగ్

- తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో బయటపడిన అక్రమాలు
- తొమ్మిది దుకాణాలపై కేసులు
- ఎలక్ట్రానిక్ కాటాలు సీజ్



మటన్ దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాపై తూకం రాయి ఉంచి తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ

ఎలమంచిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):

తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ డి.అనురాధ (నర్సీపట్నం) ఆదివారం ఎలమంచిలి పట్టణంలో చికెన్, మటన్, చేపలు, కూరగాయలు విక్రయించే దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తమ వెంట తెచ్చుకున్న తూనిక రాళ్లను ఎలక్ట్రానిక్ కాటాపై వుంచి పరిశీలించారు.

కిలోకు 100 గ్రాములు తక్కువ వున్నట్టు గురించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ కాటాలో పది శాతం తక్కువ తూకం వచ్చేలో సెట్టింగ్ చేయించుకున్నట్టు నిర్ధారించారు. చేపలు, మటన్ విక్రయిస్తున్న ఆరుగురితోపాటు ఇతర వ్యాపారాలకు చెందిన ముగ్గురు కలిపి మొత్తం తొమ్మిది కేసులు నమోదు చేసినట్టు అనురాధ తెలిపారు. ఎలక్ట్రానిక్ కాటాలను సీజ్ చేసి తమ వెంట తీసుకెళ్లారు. ఈ దాడులలో సిబ్బంది ఏ.రుషికేశ్, బి.వెంకటరెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

పేటలో అక్రమ లేఅవుట్లు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు

- ల్యాండ్ కన్వర్షన్‌కు పంచాయతీ, రెవెన్యూ శాఖలకు అందని దరఖాస్తులు
- లేఅవుట్లలో అభివృద్ధి పనులు
- నిలిపివేయాలన్న అధికారుల ఆదేశాలు బేఖాతరు





పాయకరావుపేటలో శ్మశానవాటికను ఆనుకుని అనుమతిలేకుండా వేసిన లేఅవుట్. (ఇన్‌సెట్‌లో) గత ఏడాది ఇదే లేవుట్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు(ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):

పాయకరావుపేట, చుట్టుపక్కల గ్రామాల్లో అనుమతుల్లేని లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీఎంఆర్డీఏ అనుమతులు లేకుండా దర్జాగా ఇళ్ల స్థలాల లేఅవుట్లు వేస్తున్నారు. వీటిని అధికారులు పరిశీలించి, పనులు నిలిపివేయాలని ఆదేశించినా.. రియల్టర్లు బేఖాతరు చేస్తున్నారు. పాయకరావుపేట పంచాయతీలో వివిధచోట్ల సుమారు 200 ఎకరాల్లో వేసిన లేఅవుట్లలో ఒకటి, రెండు తప్పించి మిగిలినవన్నీ వీఎంఆర్డీఏ అనుమతుల్లేకుండా, కనీస నిబంధనలు పాటించలేదు. కొన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టి, పలువురు నివాసం వుంటున్నారు. ఈ లేఅవుట్లు వేసిన రియల్టర్లు.. రహదారులు, డ్రైనేజీలు వంటి సరిగా నిర్మించకపోవడంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోయి రహదారులు ముంపునకు గురవుతున్నాయి. వీటితోపాటు కొత్తగా వేస్తున్న అక్రమ లేఅవుట్లపై తరచూ పత్రికల్లో కథనాలు ప్రచురితమవుతున్నా సంబంధిత అధికారులు పెద్దగా స్పందించడంలేదు. దీంతో నెలకొకటి చొప్పున కొత్తగా అనుమతి లేని లేఅవుట్లు వెలుస్తున్నాయి. పట్టణ శివారులోని శ్మశానవాటికను ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమిలో లేఅవుట్ వేయడానికి 'ల్యాండ్ కన్వర్షన్'కు పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి తీసుకోలేదు. లేఅవుట్ వేయడంతో పంచాయతీ అధికారులు వెళ్లి పనులు నిలిపివేయాలని, అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే పనులు చేపట్టాలని ఆదేశించారు. అయినా లేఅవుట్ వేస్తున్న వ్యక్తులు ఈ ఆదేశాలను పట్టించుకోలేదు. కొద్దిరోజుల నుంచి లేఅవుట్‌లో పనులు చేస్తున్నారు. దీనికి సంబంధించి ల్యాండ్ కన్వర్షన్‌కి ఎటువంటి దరఖాస్తు చేయలేదని రెవెన్యూ అధికారులు చెబుతుండగా, లేఅవుట్ అనుమతి కోసం తమకు కూడా దరఖాస్తు ... మిగతా 6వ పేజీలో

ఏఎంసీ వైద్యులకు పదోన్నతులు

- ఒకరికి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, ముగ్గురికి సూపరింటెండెంట్లుగా పోస్టింగ్స్



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని వివిధ విభాగాల వైద్యులకు ఇతర జిల్లాల్లోని మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపాల్స్‌గా, ఆస్పత్రులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతులు లభించాయి. గైనకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కేవీఎస్ఎం సంధ్యాదేవిని ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన బుచ్చిరాజు గత నెలలో పదవీ విరమణ చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సంధ్యాదేవి వ్యవహరిస్తున్నారు. ఆమెకే పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించారు. ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యంను ఒంగోలు లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సి.అమూల్యను ... మిగతా 6వ పేజీలో

నేడు నర్సీపట్నంలో పీజీఆర్ఎస్

- నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని నర్సీపట్నం నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనకాపల్లిలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

అభివృద్ధికి నోచుకోని అల్లూరి పార్కు

హామీలకే పరిమితమవుతున్న పాలకుల హామీలు

- రూ.1.5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు వైసీపీ హయాంలో మంత్రుల ప్రకటన
- ఐదేళ్లలో ఒక్కరూపాయి కూడా విడుదల చేయని వైనం
- రూ.50 లక్షల ఎంపీ నిధులతో అభివృద్ధి చేస్తామన్న కూటమి నేతలు
- తొమ్మిది నెలలైనా అతీగతీలేదు



పార్కులో అధ్వానంగా వున్న పగోడా



అల్లూరి, గంటందొర సమాధుల మందిరం శాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు పార్కు ఆరేళ్ల నుంచి ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన పనులు తప్ప.. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు అల్లూరి పార్కు అభివృద్ధికి రూ.1.5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు అప్పటి మంత్రులు ప్రకటించారు. కానీ ఒక్క రూపాయ కూడా విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ఏడాది జూలై నాలుగో తేదీన అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎంపీ నిధులు రూ.50 లక్షలతో పార్కులో అభివృద్ధి పనులు చేస్తామని ప్రకటించారు. పార్కులో సభావేదిక ... మిగతా 6వ పేజీలో

హడలెత్తిస్తున్న పరిశ్రమల కాలుష్యం

- గ్రామాల్లో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- అనారోగ్యం పాలవుతున్న జనం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పాలకులు, అధికారులు

రాంబిల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌ఈజడ్‌లో గల పలు పరిశ్రమల కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రోజు,రోజుకు పెరిగిపోతున్న కాలష్యం ప్రభావం కారణంగా ప్రజలు అనారోగ్యపాలవుతున్నారు. సెజ్, నాన్ సెజ్‌లోని సుమారు 200కిపైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో అధికంగా ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు 30 గ్రామాలకు అతిసమీపంలో ఉన్నాయి. ఈ కంపెనీల ద్వారా వెలువడే కాలుష్యం గ్రామాల్లోకి అధికంగా వస్తున్నది. కంపెనీల యాజమాన్యాలు రాత్రి సమయాల్లోనే కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయి. ఈ కాలుష్యం భరించలేని విధంగా ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ కాలుష్యంతో ప్రజలు అనేక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, కిడ్నీ, తదితర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే లాలంకోడూరు, కృష్ణంపాలెం, గొరపూడి, లోవపాలెం, వెంకయ్యపాలెం, గజిరెడ్డిపాలెం, కొండవారపాలెం, అప్పన్నపాలెం, ఎస్‌ఈజడ్ పునరావాసకాలనీ తదితర



కాలుష్యం వెదజల్లుతున్న అప్పన్నపాలెం సమీపంలోని ఎస్‌ఈజడ్‌లోని పరిశ్రమలు

గ్రామాలు కాలుష్యకోరల్లో చిక్కుకున్నాయి. సెజ్‌లోని పలు పరిశ్రమల కెమికల్ వ్యర్థ జలాలు లాలంకోడూరు గ్రామాన్ని ఆనుకొని ఉన్న కాలువలోకి వదిలేస్తున్నారు. ఈ నీరు దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు కూడా పెరిగిపోవడంతో లాలంకోడూరు గ్రామంలోని కుటుంబాలు వారు అనారోగ్యాలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటిని తాగిన పశువులు రోగాలు బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. కంపెనీలు ఏర్పాటు సమయంలో చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో పర్యావరణానికి సంబంధించి అధికారులు ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పి నమ్మించారని, ప్రస్తుతం కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కాలుష్య సమస్యను పాలకులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీల నుంచి నల్లటి బొగ్గులాంటి పౌడర్ గ్రామాల్లోని ఇళ్లు, పంటలపై పడుతున్నదని, పంటలు దెబ్బతింటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం తాకిడికి దెబ్బతిన్న పంటలకు మందులు కొట్టినా ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. పంటలుతోపాటు పశుగ్రాసం కూడా దెబ్బతింటున్నదని, ఈ పరిస్థితి ఇలాగే ఉంటే తమ జీవనాధారమైన వ్యవసాయం, పాడిని కూడా నష్టపోతామని అంటున్నారు. దీంతో కుటుంబాలతో రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. ఇప్పటికైన కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రిపోర్టర్లమని వ్యక్తిని బెదిరించి

సెల్‌ఫోన్ పట్టుకుపోయిన నలుగురిపై కేసు

ఎలమంచిలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు సమీపంలో ఆదివారం సాయంత్రం ప్రెస్ రిపోర్టర్లమని బెదిరించి వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ పట్టుకుపోయిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మల్లవరం గ్రామానికి చెందిన పోలవర్తి అప్పలనాయుడు వాహనంపై కోళ్ల వ్యర్థాలను తీసుకువెళుతున్నారు. ఈ వాహనాన్ని లైను కొత్తూరు వద్ద కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు అడ్డగించారు. తాము ప్రెస్ రిపోర్టర్లమని బెదిరించి రూ.15 వేలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో అతని సెల్‌ఫోన్‌ను తీసుకొని వెళ్లిపో యినట్టు బాధితుడు అప్పలనాయుడు ఎలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు రంగ ప్రవేశం చేసి విశాఖపట్నానికి చెందిన నలుగురు వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెల్లోనూ నిఘా నేత్రాలు

... 5వ పేజీ తరువాయి

సులభంగా పట్టుకోవడవంతోపాటు, అనవసర వివాదాలు, కొట్లాటలు, అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం ఉండదన్న ఉద్దేశంతో పోలీసులు ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రతి గ్రామంలో కీలక ప్రాంతాల్లో కనీసం నాలుగు అయినా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పలు పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. చోడవరం మండలం వెంకన్నపాలెం, రాయపురాజుపేట, నరసయ్యపేట, ఖండేపల్లి, కన్నంపాలెం పంచాయతీల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, మిగిలిన పంచాయతీల్లో సైతం ఏర్పాటుకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ముందుకు వస్తున్నారు. ఖండేపల్లిలో 15 సీసీ కెమెరాలను కీలక ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. వెంకన్నపాలెంలో 12 సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయి. చోడవరం శివారు గాంధీగ్రామంలో 10 కెమెరాలు బిగించారు.

ఉత్సవాలకు అనుమతులతో లింకు

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు చాలా రోజులుగా నాయకులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పెద్దగా స్పందన రాలేదు. దీంతో సీసీ కెమెరాల ఏర్పాటకు సరికొత్త ఆలోచన చేశారు. గ్రామాల్లో ఏటా అమ్మవార్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తుంటారు. భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే ఇందుకోసం పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. సీసీ కెమెరాల ఏర్పాటు ఆలోచనను ఈ సందర్భంగా అమలు చేయడం ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తేనే.. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇస్తామంటూ మెలిక పెట్టారు. దీనితో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి నాయకులు ముందుకు వస్తున్నారు.

పేటలో అక్రమ లేఅవుట్లు

... 5వ పేజీ తరువాయి

అందలేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. కానీ లేఅవుట్‌లో పనులు జరుగుతుండడం విశేషం. లేఅవుట్ వేస్తున్న వారికి రాజకీయ నాయకుల అండ ఉందన్న సమాచారంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఈఓపీఆర్డీని సీహెచ్.చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏఎంసీ వైద్యులకు పదోన్నతులు

... 5వ పేజీ తరువాయి

శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. జనరల్ సర్జరీ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.మన్మథరావును మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు వీరిలో ఇద్దరు వైద్యులు ఆయా పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి చూపడంలేదని సమాచారం.

కేజీహెచ్‌పై సందిగ్ధం

కాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టును ప్రభుత్వం భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా డాక్టర్ శివానంద వ్యవహరిస్తున్నారు. తాజాగా పదోన్నతులు పొందిన ఇద్దరితో పాటు మరో ఇద్దరు సీనియర్ వైద్యులు ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగించారు. అయితే వారికి మరోచోట అవకాశాలు లభించాయి.

అభివృద్ధికి నోచుకోని అల్లూరి పార్కు

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఇతర మరమ్మతు పనులు చేయిస్తామని చెప్పారు. ఇది జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నది. ఇంతరకు పనులు చేపట్టలేదు. పార్కులో పర్యాటకులు సేద తీరే నాలుగు పగోడాలు పూర్తిగా శిథిలమై అధ్వానంగా వున్నాయి. నడక మార్గంలో పలుచోట్ల టైల్స్ లేచిపోయాయి. అల్లూరి, గంటందొర సమాధులున్న మందిరం శ్లాబ్ నుంచి తరచూ పెచ్చులు ఊడిపడుతున్నాయి. పార్కు ప్రహరీ గోడ పలుచోట్ల దెబ్బతిన్నది. మే 7వ తేదీన అల్లూరి సీతారామరాజు వర్థంతి. కృష్ణాదేవిపేటలో అల్లూరి పార్కు అభివృద్ధికి గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని స్థానికులు, అల్లూరి అభిమానులు, పర్యాటకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా గంధం అమావాస్య పూజలు



ఎస్.రాయవరంలో భక్తులతో కిటకిటలాడుతున్న నూకాంబిక ఆలయం



ఉద్దండపురంలో అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుంటున్న నాయకులు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంధం అమావాస్య సందర్భంగా నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్.రాయవరంలో నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిటలాడింది. టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీలకు చెందిన పలువురు నాయకులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే గరగల డాన్స్, తీన్‌మార్, తప్పెటగుళ్ళ, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాల అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అంతేకాకుండా కొరుప్రోలు, పేటసూదిపురం గ్రామాల్లో నూకాంబిక జాతరను ఘనంగా జరిపారు. మధ్యాహ్నం నుంచి ఆలయాల వద్ద అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంధం అమావాస్య జాతర ఘనంగా జరిగింది. ఉద్దండపురం మరిణమ్మతల్లి ఆలయం, అమలాపురం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రేబాక గూడుపమ్మతల్లి ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉద్దండపురం, అమలాపురం గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, అయినంపూడి మణిరాజు, పాపారావు తదితరులు దర్శించుకున్నారు.టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ కూడా గంధం అమావాస్య పూజల్లో పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి పట్టణం, బయ్యవరం గ్రామంలో ఆదివారం గంధం అమావాస్య జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నూకాంబిక అమ్మవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలనికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

హామీలు నెరవేర్చడం సీఎం చంద్రబాబుకే సాధ్యం

- రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు
- వేట నిషేధ భృతితో మత్స్యకారుల్లో వెల్లివిరిసిన ఆనందం

అచ్యుతాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే సాధ్యమని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు మేరుగు బాపునాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పూడిమడకలో మత్స్యకారులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఫిష్ ఆంధ్రా పేరుతో రూ.300 కోట్లు ఖర్చుచేశారని, కాని ఒక్క మత్స్యకారునికి కూడా లబ్ధి జరగలేదన్నారు. అలాగే వేట విరామ సమయంలో రూ.పది వేలిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం సక్రమంగా మత్స్యకారులకు పంపిణీ చేయలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే వేట నిషేధ భృతి రూ.20వేలు ఇస్తామని చెప్పిన హామీని నెరవేర్చారన్నారు. గతంలో వేట నిషేధం ముగిసిన తర్వాత చాలా కాలానికి భృతి పంపిణీ చేసేవారని, కాని ముఖ్యమంత్రి మాత్రం ముందుగానే పంపిణీ చేశారన్నారు. అలాగే వేట సమయంలో ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మరణిస్తే రూ.పది లక్షలు పరిహారం ఇస్తున్నామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేరుగు వెంకటరావు, ఎరిపిల్లి చిట్టిబాబు, అజయ్, పతివాడ చిన్నయ్య నాయుడు, దోని నూకరాజు, ఎరిపిల్లి కోదండరావు, మేరుగు మహేష్, కావిరి బంగారయ్య, చెల్లూరి ఆనంద్, దోని కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు పాలాభిషేకం చేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎం.జగన్నాథపురంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఎం.జగన్నాథపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.జగన్నాథపురం హైస్కూల్‌లో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఇటీవల మృతి చెందిన సహచర మిత్రుడు ఎం.వరప్రసాద్‌కు నివాళులర్పించారు. తొలుత స్కూల్ ఆవరణలో గల తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అలుగు సంధ్య, ఈశ్వరమ్మ, బాబూరావు, అమ్మదూరి కన్నబాబు, పీలా శ్రీను, ఉగ్గిన ఉషా, దుర్గభాయి, చిట్టి వరలక్ష్మి, ధూళి నూకరాజు, ముత్తా సత్యారావు, మట్టా నాగేష్, మడక శేషు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పెంటకోట గ్రామ అధ్యక్షునిగా అప్పలరాజు



అప్పలరాజుని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ పెంటకోట గ్రామ అధ్యక్షుడిగా గేదెల అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ సంస్థగత ఎన్నికల్లో భాగంగా ఆదివారం మండలంలోని పెంటకోటలో టీడీపీ నాయకుడు చిక్కాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా గేదెల అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు యూనిట్లకు రూ.429ల విద్యుత్ బిల్లు

పాయకరావుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో విద్యుత్ సంస్థలపై పడిన అదనపు ఆర్థిక భారం ప్రస్తుతం వినియోగదారులకు శాపంగా మారింది. గత కొంతకాలంగా విద్యుత్ వినియోగదారులకు వస్తున్న విద్యుత్ బిల్లుల్లో విద్యుత్ వాడకానికి అయ్యే ఖర్చు కంటే అదనపు చార్జీలు అధికంగా ఉంటున్నాయి. ప్రభుత్వం చేసిన తప్పులకు తాము పరిహారం చెల్లించుకోవాల్సి ఉంటుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేటలోని ఒక ఇంటికి నెల రోజుల్లో వాడిన నాలుగు యూనిట్లకు అదనపు చార్జీలు కలిపి ఏకంగా రూ.429లు బిల్లు వచ్చింది. స్థానిక శ్రీలక్ష్మి థియేటర్ వెనుక వీధిలోని ఒక ఇంట్లో గత నెలలో ఎవరూ లేక విద్యుత్ వాడలేదు. ఈనెల 10వ తేదీన ఆ ఇంటి విద్యుత్ మీటర్ రీడింగ్ తీసిన విద్యుత్ శాఖ ఉద్యోగి నాలుగు యూనిట్ల వినియోగానికి ఏకంగా రూ.429 బిల్లు ఇవ్వడంతో ఇంటి యజమాని ఒక్కసారిగా అవాక్కయ్యాడు. విద్యుత్ బిల్లును ఒకసారి పరిశీలిస్తే.. గత నెల 11వ తేదీన మీటర్ రీడింగ్ 24,881 యూనిట్లు ఉండగా ఈనెల 10వ తేదీన రీడింగ్ 24,885గా ఉంది. వినియోగించిన నాలుగు యూనిట్లకు రూ.12.80, ఫిక్స్‌డ్ చార్జీలు రూ.10, కస్టమర్ చార్జీలు రూ.25, సర్‌చార్జి రూ.25 ఉన్నాయి. ఇవికాకుండా ఎఫ్‌పీపీసీఏ చార్జీ రూ.179, ఎఫ్‌పీపీసీఏ2 చార్జీ రూ.57, ఎఫ్‌పీపీసీఏ3 చార్జీ రూ.125లు కలిపి మొత్తం రూ.434లు బిల్లు అమౌంట్‌కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.5లు తగ్గించి రూ.429ల బిల్లు వచ్చింది. దీంతో నాలుగు యూనిట్ల విద్యుత్ వినియోగానికి ఎన్నడూ లేనంతగా బిల్లు వచ్చిందని, అదే నిరుపేదల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు.



కరెంటు బిల్లు

ఠారెత్తించిన సూరీడు

ఎలమంచిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గుమంటుండడంతో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎలమంచిలిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి భానుడు తమ ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోవడంతో ప్రధాన జంక్షన్లు, వ్యాపార సముదాయాలు జనం లేక నిర్మానుష్యంగా మారాయి. ఆదివారం మరింత ఎండ వేడిమి ఉండడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆదివారం నిర్మానుష్యంగా మారిన ఎలమంచిలి ప్రధాన రోడ్డు జంక్షన్

మే డేను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల బలిదానంతో ఎనిమిది గంటల పని సాధించిన ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే డే పతాకావిష్కరణలో పాల్గొనడంతోపాటు సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రొంగలి రాము, కె.సోమునాయుడు, రాజాన సత్తిబాబు, గొర్లె సత్తిబాబు, రాము, అప్పలరాజు, తట్ట రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



దిమిలిరోడ్డు జంక్షన్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాతలు

ఎలమంచిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతవీధి దిమిలి రోడ్డు జంక్షన్ సమీపంలో సతకంపట్టు వద్ద దాతల సాయంతో ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలిరోజు యల్లపు అప్పారావు కుమారులు యల్లపు శేషుబాబు బ్రదర్స్ ఆర్థిక సాయంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు పండూరి తాతబాబు, ఆడారి శివ తెలిపారు. ప్రతి రోజూ దాతలు ముందుకు వస్తుండడంతో మజ్జిగ చలివేంద్రం పాదచారుల దాహార్తిని తీర్చేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేసినట్టు వ్యాపారి యల్లపు రాజు తెలిపారు. ఆదివారం యల్లపు బ్రదర్స్ దాతల సాయంతో తొలిరోజు కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో యల్లపు చంద్రబాబు, యల్లపు ప్రసాదు, కిరాణా వ్యాపారి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమం

అచ్యుతాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటపాటలతోపాటు చదువుపై కూడా దృష్టి సారించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. చిన్నారులకు కావలసిన పుస్తకాలన్నీ అందుబాటులో ఉంచామని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని గ్రంథాలయానికి పంపాలని ఆయన కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరంపై అవగాహన

నక్కపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో ఈనెల 28వ తేదీ నుంచి విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి కె.జనార్దన్ చెప్పారు. ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంపై చినదొడ్డిగల్లు గ్రంథాలయం వద్ద అవగాహనా సదస్సు నిర్వహించారు. 40 రోజుల పాటు కొనసాగే వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. పిల్లల కోసం అనేక విజ్ఞాన, చరిత్ర పుస్తకాలు అందుబాటులో వున్నాయని, విద్యార్థులకు ఆటల, పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

పూడిమడకలో దోమల నివారణకు చర్యలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో దోమల నివారణకు చర్యలు చేపట్టామని సర్పంచ్ చేపల సుహాషిణి తెలిపారు. గ్రామంలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నా తీర ప్రాంతం కావడంతో దోమలు అధికంగా ఉంటున్నాయన్నారు. గ్రామంలో దోమల నివారణ ఫాగింగ్ చేపట్టామన్నారు.

టీడీపీ కోటవురట్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యేసుబాబు



కోటవురట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోటవురట్ల గ్రామ కమిటీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు అధ్యక్షతన కోటవురట్ల గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ కమిటీ అధ్యక్షులుగా కసిరెడ్డి యేసుబాబు, కార్యదర్శిగా బత్తుల రామ్మ కృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షులు ఎన్నికైనా యేసుబాబు మాట్లాడుతూ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు.

కొత్తరేవుపోలవరంలో వేసవి క్రీడా పోటీలు ప్రారంభం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తరేవుపోలవరంలో మాజీసర్పంచ్ చోడిపల్లి బంగారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆదివారం ఎన్.సీతారామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మాజీ సర్పంచ్ బంగారి మాట్లాడుతూ కొత్తరేవుపోలవరం, రేవుపోలవరం గ్రామాలకు చెందిన క్రీడాకారుల కోసం రూ. లక్షన్నర సొంత నిధులతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు బహుమతులు అందజేస్తామన్నారు.

నష్టపరిహారం నగదు రూపంలో చెల్లించాలి

- జేఏసీ సభ్యుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి అచ్చింనాయుడు

మునగపాక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు సంబంధించి నష్టపరిహారం నగదు రూపంలోనే చెల్లించాలని జేఏసీ సభ్యుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సహకార సంఘం వద్ద ఆదివారం నిర్వాసితులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు రూపంలో చెల్లింపులకు ప్రభుత్వం ముందుకొస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో నిర్వాసితులు బొద్దపు శ్రీరామ్మూర్తి, వి.జగన్నాథరావు, పలు గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు.

మే డే వేడుకలను ఘనంగా నిర్వహించాలి

రాంబిల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు చోట్ల జరగనున్న మే డే వేడుకలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ మండల కమిటీ కన్వీనర్ చందక రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నేతలు బద్ది భాస్కరరావు, డి.కాశియ్య, సీహెచ్ నూకరాజు, ఉమ్మిడి సత్యనారాయణ, సుజాత, మంగ, దేవి తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్న

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. మాకవరపాలెం మండలం పాపయ్యపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి రామలక్ష్మికి రూ.3.69 లక్షల చెక్కు అందించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నదని చెప్పారు. తొమ్మిది నెలల్లో 24 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యర్రాపాత్రుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

83 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలు, నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

నర్సీపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పెదబొడ్డేపల్లిలో ఒక ఇంట్లో ఎక్సైజ్ అధికారులు ఆదివారం 83 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ అందిన ముందస్తు సమాచారంతో పెదబొడ్డేపల్లి శ్రీరామ కాలనీ డోర్ నెంబరు 12-33/ఏ గల ఇంట్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేయడానికి వెళ్లినట్టు తెలిపారు. ఒక వ్యక్తి చేతి సంచితో ఇంట్లోంచి బయటకు వస్తూ కనిపించాడని తెలిపారు. అతన్ని పట్టుకొని ఇంట్లో సోదాలు చేయగా 14 బ్రాండ్‌లకు సంబంధించి 83 డిఫెన్స్ మద్యం (750 ఎంఎల్) సీసాలు లభ్యమయ్యాయని తెలిపారు. వీటి విలువ రూ.90,800 ఉంటుందని తెలిపారు. ఈ కేసులో వజ్రగడకు చెందిన తమరాన అప్పలనాయుడును అరెస్టు చేశామని తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐలు కిరణ్‌కుమార్, అభిషేక్, హెచ్‌సీలు శంకర్, బాబూరావు, రైడ్ కానిస్టేబుల్ లావణ్య పాల్గొన్నారు.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	230

చోడవరంలో నాటుకోళ్ల దొంగలు

» ఇళ్లు, కళ్లాల వద్ద పెంచుకుంటున్న కోళ్లను ఎత్తుకుపోతున్న అగంతకులు

చోడవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో నాటుకోళ్ల దొంగలు ఎక్కువయ్యారు. ఇళ్ల వద్ద పెంచుకుంటున్న కోళ్లను రాత్రి సమయాల్లో ఎత్తుకుపోతున్న ఘటనలు ఎక్కువ కావడంతో కోళ్ల పెంపకందారులు లబోదిబోమంటున్నారు. స్థానిక ద్వారకానగర్‌లో కృష్ణుడి గుడి సమీపంలో ఓ ఆసామి ఇంటి వద్ద పెంచుకుంటున్న 5 నాటు కోళ్లను శనివారం అర్ధరాత్రి దొంగిలించారు.

ఇంటి ఆవరణలో ఉన్న కోళ్లను ఎలాంటి అలికిడి లేకుండా ఎత్తుకుపోవడం విశేషం. ఇదే ప్రాంతానికి ఆనుకుని ఉన్న నరసయ్యపేటలోని ఓ అరటితోటలో పెంచుకుంటున్న కోళ్లలో ఐదింటిని కొద్దిరోజుల క్రితమే ఎత్తుకుపోయారు. అదే ప్రాంతంలోని కళ్లాల వద్ద ఉన్న కోళ్లను కూడా దొంగలు అపహరించడం ఎక్కువైంది.

పట్టణ శివారు అంకుపాలెంలో కూడా ఇటీవల ఓ రైతు పొలంలోని కళ్లం వద్ద ఉన్న మూడు కోళ్లు ఎత్తుకుపోయారు. ఇలా ఇళ్లతోపాటు కళ్లాల వద్ద ఉన్న కోళ్లను ఎత్తుకుపోతుండడంతో పెంపకందారులకు దిక్కుతోచడం లేదు. మద్యం చెడు వ్యసనాలకు పాల్పడిన కొందరు తమ ఖర్చులకు డబ్బుల కోసమే నాటు కోళ్లను ఎత్తుకుపోతున్నారని స్థానికులు చెపుతున్నారు. పోలీసులు ఈ కోళ్ల దొంగలపైనా నిఘా వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసగా కొవ్వొత్తుల ర్యాలీలు

నర్సీపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఆదివారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఎన్టీఆర్ మిని స్టేడియం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించిన ర్యాలీలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, అడిగర్ల వరహాలనాయుడు, జీవీరమేశ్, అల్లు అప్పారావు, బాబీ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం ప్రధాన రహదారిపై ర్యాలీ చేస్తున్న నాయకులు

మాడుగులలో...

మాడుగుల: ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ ఆదివారం రాత్రి ఏపీయూడబ్ల్యూజే మాడుగుల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మృతులకు ఘనంగా నివాళులు అర్పించారు. ర్యాలీలో పెద్దలు, పాత్రికేయులు పాల్గొన్నారు.



మాడుగులలో నిరసన తెలుపుతున్న విలేకరులు, నాయకులు

వడ్డాదిలో...

బుచ్చెయ్యపేట: పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ మండలంలో వడ్డాది గ్రామంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వివిధ పార్టీ నేతలు, పాత్రికేయులు, ఎన్జీవో ప్రతినిధులు, అమ్మ హెల్పింగ్ హార్ట్ సభ్యులు, గ్రామస్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించి, ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు నివాళుల అర్పించారు. ఈ కార్యక్రమములో దొండా నరేష్‌శిరిగిరిశెట్టి శ్రీరామ్, తలారి శంకర్, దొరపిల్ల, దొండా నారాయణమూర్తి, నానాజీ తదిరరులు పాల్గొన్నారు.

చురుగ్గా పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు

నాతవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ పంచాయతీలలో మూగజీవాల దాహర్తిని తీర్చడానికి నీటితొట్టి నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా 15 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. ఒక్కొక్క నీటి తొట్టె నిర్మాణానికి ప్రభుత్వం 30 వేల రూపాయలు ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేసింది.

ఈ నిధులతో నీటి తొట్టెల నిర్మాణాలు చేపడుతున్నారు. నీటి సదుపాయం ఉన్నచోట, పశువులు మేతకు వెళ్లే మార్గంలో వీటిని నిర్మించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నాతవరం పశువైద్య కేంద్రం వద్ద ఎక్కువగా పశువులు వచ్చేచోట నీటి తొట్టె నిర్మాణం పూర్తి చేశారు. ఇప్పటి వరకు జిల్లేడిపూడి, నాతవరం, గొలుగొండపేట, ఎంటీపట్నం చమ్మచింత, లింగంపేట గ్రామాలలో ఈ వేసవిలో మూగజీవాల దాహర్తిని తీర్చడానికి నీటితొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. అలాగే మిగతా చోట్ల చురుకుగా నీటి తొట్టె నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి.



నాతవరం పశువైద్య కేంద్రం వద్ద నిర్మిస్తున్న నీటి తొట్టె నిర్మాణం



వాహనదారుల రికార్డులను తనిఖీలు చేస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేటలో ముమ్మరంగా వాహన తనిఖీలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేటలో ఆదివారం ఎస్ఐ వై.తారకేశ్వరరావు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం దేశంలో పరిస్థితుల దృష్ట్యా ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు వాహన రికార్డులను, వచ్చివెళ్లే వాహనదారుల వివరాలను ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహన రికార్డులు, లైసెన్సులు తమ వద్దే ఉంచుకోవాలని సూచించారు. వేసవిలో దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి సుదూర ప్రాంతాలకు వెళ్తే, ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మతల్లి జాతర

మాకవరపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాకవరపాలెంలో దుర్గాలమ్మతల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా గంధామావాస్య సందర్భంగా గ్రామానికి చెందిన శెట్టిబలిజ కులస్థులు ఈ పండగను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ఆదివారం అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చిడతల డాన్సులు ఎంతగానో అలరించాయి. అలాగే ఉదయం నుంచి గుడి వద్ద భక్తులు బారులు తీశారు. మధ్యాహ్నం గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలం రాము, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరంలో పౌష్టికాహారం పంపిణీ

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిఓణ శిబిరంలో ఆదివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో జెఎస్ఎస్.నాగేశ్వరరావు, అధ్యాపకుడు మొలగలపిల్లి నారాయణమూర్తి, ఉద్యోగులు గోపాలరావు, బాలకృష్ణ చేతుల మీదుగా క్రీడాకారులకు పౌష్టికాహారం అందించారు. 40 రోజుల పాటు ఈ శిబిరం నిర్వహించనున్నట్టు కోచ్ ఎర్ర శేఖర్ తెలిపారు.

జానకిరాంపురం పీఏసీఎస్‌లో సెక్షన్ 51 విచారణ నిలుపుదల

రోలుగుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో బినామీ రుణాల పేరుతో రూ.2కోట్లు పైగా నిధుల స్వాహాపై నిగ్గు తేల్చేందుకు వేసిన సెక్షన్ 51 విచారణను నిలుపుదల చేస్తూ ఆ శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. గత రెండేళ్లుగా బాధ్యులపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని, బినామీ రుణాల భాగోతం నిగ్గు తేల్చాలని కోరుతూ సంఘ సభ్యులైన కిల్లాడ సాంబమూర్తి నాయుడు, గొల్లు నారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు, గొల్లు కల్పన, పి.శ్రీనివాసరావు తదితరులు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 7న సెక్షన్ 51 కింద విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆ శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రేమ స్వరూపరాణి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి నేటి వరకు సెక్షన్ 51 కింద విచారణ నిర్వహించకుండా తాత్సారం చేశారు. ప్రస్తుతం ఆ శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ విచారణను నిలుపుదల చేస్తూ ఆదేశాలు చేశారు. ఈ నిలుపుదల వెనుక స్థానిక నాయకుల ఒత్తిడిఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఇప్పటికే సొసైటీ అప్పటి సీఈఓ రామకృష్ణ, ఆఫీసు అసిస్టెంట్ దేములు ఈ ఏడాది ఫిబ్రవరిలో నర్సీపట్నం బ్రాంచిలోకి పెట్రోల్ క్యాన్‌తో ప్రవేశించి ఉద్యోగులను తీవ్ర భయాందోళనకు గురిచేసిన ఘటనపై సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే.

ఎర్నమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే బండారు పూజలు



ఎర్నమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

దేవరాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.గజపతినగరం శివారు వడ్రపాలెంలో ఎర్నమ్మ గ్రామ దేవతను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం దర్శించుకున్నారు. నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండుగ

రోలుగుంట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గంధం అమావాస్యను పురస్కరించుకుని రోలుగుంటలో ఆదివారం పరదేశమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి గ్రంథాలయంలో వేసవి తరగతులు

చీడికాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకూ చీడికాడ గ్రంథాలయంలో వేసవి పునరుచ్చరణ తరగతులు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్.జోగేశ్వరి ఆదివారం తెలిపారు. విద్యార్థులకు ప్రతి రోజూ కథలు వినిపించడం, పుస్తకాలు చదివించడం, డ్రాయింగ్, పెయింటింగ్, జనరల్ నాలెడ్జి, క్విజ్, మొదలగు అంశాలలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉత్సాహవంతులైన యువత, పదవీవిరమణ పొందినవారు అందరూ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందిగా ఆమె కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని ఎ.కోడూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ మన ప్రాంతంలో శస్త్ర చికిత్సలు జరిగినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం అవసరమైన బాధితులకు వెంటనే రక్తం ఇచ్చుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు ఈ విధంగా సహాయం చేస్తుందన్నారు. స్థానిక సంఘ మిత్ర సొసైటీ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు. వందేభారత్ బ్లడ్ బ్యాంకు ఎండీ వినోద్‌బాబు, స్థానిక సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు, లెక్కల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 68 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చుక్కల మందులు, ఇతర మందులు ఇచ్చారు. వీరిలో 26 మందిని ఆపరేషన్ నిమిత్తం బస్సులో విశాఖకు తరలించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి క్యాంప్ డిప్యూటీ మేనేజర్ అరుణ్‌కుమార్, డాక్టర్ జాన్, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గొప్ప వెంకట్రావు పాల్గొన్నారు.



నేత్ర శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అంబేడ్కర్, పూలేల పోరాట స్ఫూర్తి స్వీకరించాలి

» దళిత విముక్తి రాష్ట్ర కమిటీ కన్వీనర్ సుర్ల వెంకటరావు



సామాజిక చైతన్యసభలో పాల్గొన్న దళిత నేతలు

చోడవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే పోరాట స్ఫూర్తిని దళితులంతా స్వీకరించాలని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరావు పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించిన దళిత సామాజిక చైతన్యసభలో ఆయన మాట్లాడారు. దళిత, బడుగు, బలహీన వర్గాల హక్కులకు ప్రస్తుతం విలువ లేకుండా పోయిందని, దళితులపై నరహంతక దాడులు అణచివేత చర్యలు ఎక్కువయ్యాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వరంగ సంస్థల్లో రిజర్వేషన్లు అంతరించిపోయే పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ పరిస్థితుల్లో అంబేడ్కర్, పూలేల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని దళితుల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ సభలో మాకవరపాలెం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొరవి సుందరరావు, దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ, భారత నాస్తిక సంఘం అధ్యక్షుడు జీడి సారయ్య, ఎం.ఎన్ బుద్ధ, దళిత నాయకుడు దేముడు మాస్టారు, బంకపల్లి అప్పారావు, బి. సన్యాసమ్మ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్, పూలేల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.కుమార్, శివ, ద్వారకానగర్ సంక్షేమ సంఘం హుస్సేన్, బోడయ్య, రెహమాన్, గొల్లయ్య, చిన్న, రాజబాబు, పల్లా శ్రీను, తారబీ, అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

కేజీబీవీ భవన నిర్మాణ పనులు పరిశీలన



కేజీబీవీ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈఈ కె.గణేష్

దేవరాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో భవన నిర్మాణ పనులను సర్వశిక్ష అభియాన్ డీఈఈ కె.గణేష్ ఏఈఈ సంతోష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో రూ.51.93 లక్షలు మంజూరు చేయగా.. అప్పట్లో రూ.28లక్షల విలువైన పనులు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన బడి.. మన భవిష్యత్తుగా పేరు మార్చి పనులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో 12 కేజీబీవీలో జూనియర్ కళాశాలల భవణాల నిర్మాణానికి రూ.1.6 కోట్లు చొప్పున మంజూరయ్యాయని డీఈఈ గణేష్ తెలిపారు. బేతపూడి కేజీబీవీ జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.1.6 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయన్నారు. ఈ భవనల్లో ఆరు డార్మెటరీ గదులు, రెండు మరుగుదొడ్లు ఉంటాయన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 19 కేజీబీవీల్లో రూ.8.55 కోట్లతో మనబడి, మన భవిష్యత్తు పథకంలో అదనపు భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ భవనాల పనులను వేసవి సెలవులు అనంతరం పాఠశాల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు సైతం పక్కాగా పాటిస్తూ పనులు చేపడుతున్నట్టు డీఈఈ గణేష్ తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్ మానసకు సత్కారం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో 975 ర్యాంకు సాధించిన రావాడ సాయిమోహిని మానసను ఆదివారం ఘనంగా సత్కరించారు. చినబాబుకాలనీలో డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీ పార్వతి ర్యాంకర్ మానసను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పణిభూషణ్‌శ్రీధర్, కె.వెంకటరమణ, వై.సూరిఅప్పారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మానసను సత్కరించిన దృశ్యం

పకడ్బందీగా గురుకులాల ప్రవేశ పరీక్ష

తుమ్మపాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చి ప్రవేశ పరీక్ష రాశారు. 201 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 180 మంది పరీక్షకు హాజరయ్యారు.

ఉపాధి శ్రామికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



ఉపాధి శ్రామికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అప్పారావు

చోడవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో శనివారం ఉపాధి శ్రామికులకు పని ప్రదేశంలోనే జనసేన నాయకులు మజ్జిగను పంపిణీ చేశారు. శారదానగర్‌లో పనిచేస్తున్న 400 మంది శ్రామికులకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఏడువాక నూకరాజు, బండి గోపి, కరణం శేఖర్, వేపాడ అప్పారావు, ఏడువాక శ్రీను, కాలువ సంఘం డైరెక్టర్ దర్శిశెట్టి దాలినాయుడు, పాలసంఘం డైరెక్టర్ ఏడువాక శంకరరావు, కోట్ని నాయుడు, బేరా సన్యాసిరావు పాల్గొన్నారు.

కోమళ్లపూడి శివాలయానికి విరాళాల వెల్లువ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోమళ్లపూడి శివాలయం నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తాయి. ఈ ఆలయాన్ని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ నిర్మిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు సిమెంట్ బస్తాలు, నగదు విరాళాలుగా అందజేశారు. వారికి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

మోదకొండమ్మ ఆలయంలో పూజలు

మాడుగుల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే మరికొంతమంది భక్తలు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా బాల వికాస్ పాఠశాలల వార్షికోత్సవం

మాడుగుల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో జిల్లా సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాల వికాస్ పాఠశాలల జిల్లా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన ప్రాంతాలలో గల బాల వికాస్ కేంద్రాలలో చదువుతున్న విద్యార్థులు పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం వారికి విద్య, సంస్కృతి, సంప్రదాయ, సంస్కారం వంటి పలు అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సమరత సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

30న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చీడికాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న వింటిపాలెంలో అభయాంజనేయస్వామి నూతన ఆలయం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆ గ్రామ పెద్దలు తెలిపారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు వినాయక పూజతో ప్రారంభమై యాగశాల ప్రవేశం, రక్షబందనం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని, 30వ తేదీ ఉదయం 5గంటల నుంచి పూజలు, విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నసమారాధన, 3 గంటలకు జిల్లాస్థాయి ఎడ్ల పరుగుపోటీలు నిర్వహించనున్నామన్నారు.

ప్రభుత్వం దృష్టికి సీఆర్‌టీల సమస్య



ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడుకి వినతి పత్రం అందజేస్తున్న సీఆర్‌టీలు

చింతపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలను క్రమబద్ధీకరణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. తొలుత పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సీఆర్‌టీలు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌టీలను జీవో 144 ఆధారంగా జిల్లాలో 295మందిని క్రమబద్ధీకరించిందన్నారు.ప్రస్తుతం అర్హులైన 86మందిని రెగ్యులర్ చేయాల్సి ఉందన్నారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డీజీనాథ్, జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేముడునాయుడు, కురుస రమణ, రాష్ట్ర కౌన్సెలర్ కొర్రు మత్స్యలింగం, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రొబ్బ వెంకట రమణమ్మ, నాయకులు ఉత్తర కుమారి, కృష్ణకుమారి, యశోద, మధుబాబు, గిరిజా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



జ్వరబాధితురాలుని పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

చింతపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. ఆదివారం స్థానిక ముత్యాలమ్మ జాతరలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరంలో 252మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈసీజన్‌లో గిరిజన గ్రామాల్లో జ్వరాలు, అతిసార, ఇతర రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. నాటు వైద్యం, పసర మందులకు దూరంగా ఉండాలన్నారు. కాగా వైద్యాధికారి హిమబిందుని కరాటే కోఫోకాన్ జిల్లా ముఖ్యశిక్షకుడు బాకూరు పాండురాజు, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, వీరకోటి సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు సరోజిని పాల్గొన్నారు.

'గిరిజన మత్స్యకారులకు లైసెన్స్‌లు ఇవ్వాలి'



మాట్లాడతున్న టీడీపీ నేత పాండురంగస్వామి

పాడేరురూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గిరిజన మత్స్యకారులకు లైసెన్సు ఇవ్వాలని, 90 శాతం రాయితీ ద్వారా బోట్లు, వలలు అందించాలని తెలుగుదేశం పార్టీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూటీడీపీ ప్రభుత్వ హయాంలోనే గతంలో మత్స్యకారులకు వెలుగు ద్వారా వలలు కొనుగోలుకు రూ. 10 వేల చొప్పున సహాయం చేసినట్టు గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో గిరిజన మత్స్యకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వారికి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. లైసెన్స్ ఇస్తే.. పడవ ప్రమాదంలో మరణిస్తే రూ. 10 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శోభన్, గడుతుల మురళీ పాల్గొన్నారు.

వ్యవసాయ సాగు యంత్రాలు పంపిణీ



మాట్లాడతున్న టీడీపీ నేత పాండురంగస్వామి

చింతపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి గ్రామంలో గిరిజన రైతులకు అల్లూరి సీతారామరాజు రైతు ఉత్పత్తిదారుల సంఘం రాయితీపై వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేసింది. ఆదివారం ఆర్ఫ్, ఎన్‌సీడీసీ సంస్థల సహకారంతో ఎఫ్‌పీవో ప్రతినిధులు రైతులకు యంత్రాల వినియోగంపై అవగాహన, యంత్రాలను పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎఫ్‌పీవో ప్రతినిధి ఎన్. సన్యాసిరావు మాట్లాడుతూ రైతులు ఎఫ్‌పీవో భాగస్వాములు కావాలన్నారు. యంత్రాల వినియోగించడం వల్ల కూలీల ఖర్చు, సమయం ఆదాఅవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో బెండి శంకరరావు, మాజీ సర్పంచ్‌లు రామస్వామి, పెనుమల కాంతమ్మ, ఆర్‌పీ శారదమ్మ, కోఆర్డినేటర్ గోవిందరావు, కృష్ణ పాల్గొన్నారు.

4 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

హుకుంపేట ఏప్రిల్ 27 ఆంధ్రజ్యోతి ; మండల కేంద్రంలోని మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు మే 4,5,6 తేదీలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్థులు, ఉద్యోగులు, వర్తక సంఘం నాయకులు సహకారంతో మూడు రోజులు ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ తనూజారాణి



అమ్మవారికి సారెను తీసుకువస్తున్న భక్తులు

కిటకిటలాడిన ముత్యాలమ్మ ఆలయం

» అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

చింతపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మ జాతర ఆఖరు రోజైన ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జాతర ముగింపు, గంధామవాస్య కావడంతో ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. దీంతో క్యూలైన్‌లో గంటలతరబడి నిల్చోవాల్సివచ్చింది. అలాగే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు డప్పు వాయిద్యాలతో సారెను గృహాలను నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. రాత్రి 11గంటల వరకు అమ్మవారి ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. అమ్మవారిని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖులకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెడిరెడ్ల బేతాళుడు, ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రాలను అందజేశారు. గ్రామ యువత తాడి రమణ, తాడిపాకల నాగేశ్వరరావు, రాజు, ఈశ్వరరావు, చిన్ని, రామకృష్ణ అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.సర్పంచ్ దురియా పుష్పలత, జీకేవీధి, కొయ్యూరు, అనంతగిరి ఎంపీపీలు బోయిన కుమారి, బడుగు రమేశ్, శెట్టి నీలవేణి, పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డీజీనాథ్, జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో భక్తుల తాకిడి

ఉత్సవ కమిటీకి సన్మానం

జాతర విజయవంతానికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు అహర్నిశలు శ్రమించి భక్తుల మన్నన అందుకోవడం ఆనందంగా ఉందని ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. ఆదివారం వినాయక యూత్ జాతర జయప్రదానికి క్రియాశీలక పాత్రపోషించిన ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులకు సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ కలెక్టర్ దినేశ్‌కుమార్, ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా, డివిజన్, మండల స్థాయి అధికారులు జతర విజయవంతానికి చొరవతీసుకున్నారన్నారు. వినాయ యూత్ సభ్యులు చింతపల్లి ఎంపీపీ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్, ప్రదాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి పద్మలను సన్మానించారు. ఏఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, వినాయకయూత్ అధ్యక్షుడు పైలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ అమ్మవారి ప్రధాన పండగ

» అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

సీలేరు, ఏప్రిల్ 27 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు గ్రామదేవత మారెమ్మ 53 వ వార్షిక మహోత్సవాల్లో ఆదివారం అమ్మవారి ప్రధాన పండ గ అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్రం నుంచి నలుమూల నుంచి, సరిహద్దుల్లోని ఒడిశా ప్రాంతంనుంచి భారీగా సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన పండగను పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించారు. సీలేరుకు చెందిన దివంగత జీ పూకాబత్తుడు, కోటేశ్వరమ్మ కుమారుడు సత్యనారాయణ (స్టీల్‌ప్లాంట్ రిటైర్డు ఉద్యోగి), రాజ్యలక్ష్మి దంపతులు ఆర్థిక సహాయంతో 3 వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సీలేరుకు చెందిన ముస్లిం సోదరులు కులమతాలకు అతీతంగా భక్తులకు మజ్జిగ సరఫరా చేశారు. ఆలయ ప్రాంగణంలో గిరిజనులు ఆచార సంప్రదాయమైన థింసా నృత్యం ఆలయ నిర్మాహకులు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పలువురు భక్తులు ఈ కళాకారులతో కలసి నృత్యం చేసారు. సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ బి చంద్రశేఖరరెడ్డి, ఈఈ లు బాలకృష్ణ, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ఏడీఈ దుర్గాశ్రీనివాస్ తదితరులు మారెమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీలేరు ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలను, జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు



అలంకరణలో అమ్మవారు

ఉగ్రదాడి మృతులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

పాడేరురూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహలగాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రం పాడేరులో కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టి నివాళులర్పించారు. అంబేడ్కర్ కూడలి నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావుదొర మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులు దృష్ట్యా దేశ సరిహద్దుల్లో మరింత అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్య క్రమంలో ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర, ఆల్ ఇండియా ఆదివాసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చిట్టపులి శ్రీనివాస్ పడాల్, ఎస్టీ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ఆదివాసీ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గడబారి సోంబాబు, జీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు కిరసాని కిశోర్, ఇతర ప్రజా సంఘాల నాయకులు సోమెలి సింహాచలం, ఎం.ఈశ్వరరావు, జి.జనార్దన్, పి. సురేశ్, ఎం.బాబూజీ, ఎస్.నూకరాజు, టీడీపీ నాయకుడు పి.పాండురంగస్వామి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ చింతపల్లి, జీకే వీధి మండలాల్లో ఫీడర్‌ల మరమ్మతుల నేపథ్యంలో 29వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ చింతపల్లి ఫీడర్ పరిధి ఏటిగైరంపేట, బుచ్చంపేట గ్రామాల వద్ద నిర్వహణ పనులు చేపడుతున్నందున చింతపల్లి, జీకేవీధి మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్‌కు అంతరాయం ఉం టుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర



అరకులోయలో మాట్లాడుతున్న దొన్నుదొర

అరకులోయ/ అనంతగిరి ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని, ఇందులో బాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున భృతి అందించినట్టు విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. ఆదివారం అరకులోయలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రెట్టింపు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల్లో ప్రకటించిన ఏన్డీయే ప్రభుత్వం ఈహామీని నెరవేర్చారన్నారు. 1,29,178 కుటుంబాలకు రూ.20వేల చొప్పున సుమారు రూ.259 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేశారన్నారు. గత ప్రభుత్వం వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 10 వేలు అరకొరగా చెల్లింపులు చేశారన్నారు. దీనిని సీఎం చంద్రబాబు రూ.20 వేల చేశారన్నారు. గత ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క మత్స్యకార కుటుంబమైనా బాగుపడిందా ? అని ప్రశ్నించారు. మత్స్యకారుల కుటుంబాల్లో వేట సమయంలో మరణిస్తే రూ. 10 లక్షలు నష్టపరిహారం అందజేస్తోందన్నారు. బోట్లకు లీటర్‌డీజిల్‌పై రూ.9 రాయితీ కల్పిస్తోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతగిరిలో జరిగినసమావేశంలో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకులు గురువులు, భీమన్న, శంకరరావు, దయానిధి, సుబ్బారావు, రవీంద్ర, బాబీ, చందు, నాగరాజు, అప్పలస్వామి, వెంకటరావు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

హుకుంపేట ఏప్రిల్ 27 ఆంధ్రజ్యోతి ; స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారంనుంచి వేసవి శిక్షణ తరగతతులు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి మానస తెలిపారు. 45 రోజులపాటు పిల్లలకు పలు ఆటలు, పాటలు వ్యాసరచన, పుస్తక పఠనంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. వీటిపై పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



పాడేరు రేకులకాలనీ వద్ద డీఎస్సీ నోటిఫికేషన్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు, నిరుద్యోగులు

పాడేరురూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ ప్రస్తుతం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ జీవో కాపీలను స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ నాయకులు ఆదివారం రేకులకాలనీలోని పీఎంఆర్సీ వద్ద దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అరకులో జరిపిన ఎన్నికప్రచారంలో చేసిన ఆదివాసీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలుపకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతంలో శత శాతం ఉద్యోగాలు ఆదివాసీలకు కేటాయించేలాఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30లోగా ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను వి డుదల చేయకుంటే మే 2నుంచి నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు కూడా రాధాకృష్ణ, వంతాల నాగేశ్వరరావు, భాను, ప్రతాప్, జె.కుమారస్వామి, సీహెచ్.మహేష్, పి. చిరంజీవి, డి.మోహన్, పి.నరేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

హుకుంపేట; జీవో3 అమలు చేసి ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఓల్డా, గూడ, హుకుంపేట, ఒంటిపాక గ్రామాల్లో ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఆ పత్రాలు దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా గిరిజన సాధన కమిటీ సభ్యులు రాధాకృష్ణ, సురేశ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఆదివాసులకు వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ల చట్టం చేసి దీనిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం మే2న మన్యం బంద్ నిర్వహిస్తామన్నారు. సభ్యులు ఎస్. సత్యనారాయణ, గణేశ్, ప్రసాద్, ఎస్. భూషణం, కాంతి రాజు పాల్గొన్నారు.

శతశాతం ఉద్యోగాలు స్థానికులకే చెందాలి

జి.మాడుగుల: ఏజెన్సీలోని ఉద్యోగాలు నూరుశాతం స్థానిక గిరిజనులతో భర్తీ చేయాలని ప్రత్యేక డీఎస్సీ సాధన మండల కమిటీ నాయకుడు మత్స్యరాస నారాయణరాజు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈడీ, బీఈడీ అభ్యర్థులు ఎం.ప్రశాంత్, చిన్నరావు, గంగరాజు, వెంకటరమణ, కొండలరావు, కల్యాణ్, సింహాచలం, పెసా మండల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, లయ స్వచ్ఛంద సేవ ప్రతినిధి మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

'హామీ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే..'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలుపుకుందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. కుమ్మరిపుట్టు ఆమె నివాసగృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత మూడు నె లలుగా మత్స్యకారుల వేట నిషేధం కావడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటారన్నారు. ఈ స్థితిలో శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మత్స్యకారులకు వేట నిషేధ భృతిని విడుదల చేశారన్నారు.గతంలో ఇచ్చే రూ. 10 వేలను రెట్టింపుచేసి రూ. 20 వేలు చొప్పున 550 గ్రామాల్లో 1,29,179 కుటుంబాలకు రూ. 259 కోట్ల కేటాయించిన చంద్రబాబుకు ప్రజల తరపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ పాల్గొన్నారు.

చిన్నారుల జలకాలాట



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న చిన్నారులు

జి.మాడుగుల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కొత్తపల్లి జలపాతంలో ఆదివారం చిన్నారులు సందడి చేశారు. పర్యాటకులు పెద్దగా సందర్శించలేదు. స్థానిక చిన్నారులు మా త్రం జలపాతం వద్ద మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతంలో నీరు స్వచ్ఛంగా కనిపించింది. కాగా జలపాతం చుట్టూ చెట్లు కొత్త చిగురునిచ్చి కనువిందు చేస్తున్నాయి.

మూలకు చేరిన 108 వాహనం



అనంతగిరిలో తుప్పల్లో ఉన్న 108 బొలేరో వాహనం

అనంతగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాం తాల్లో మారుమూల గ్రామాల్లో సైతం అత్యవసరంగా ఆస్పత్రులకు రోగులను తరలించేందుకు వీలుగా 108 వ్యాన్‌లకు బదులుగా బొలేరో వాహనాలను కేటాయించింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత.. మళ్లీ వ్యాన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది.. దీంతో గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన బొలేరో వాహనాలను పక్కన పెట్టేశారు. అప్పట్లో అనంతగిరి మండలానికి కేటాయించిన బొలేరో వాహనం బాగా ఉన్న సమయంలో వ్యాన్ అందుబాటులోకి రావడంతో దానిని వదిలేశారు. దీంతో ప్రస్తుతం ఈ వాహనం తుప్పల్లో దర్శనమిస్తోంది.. ఇకనైనా అధికారులు స్పందించి వాహనాన్ని మరమ్మతులు చేయించి ఏదైనా శాఖకు కేటాయిస్తే ఫలితం ఉంటుందని పలువురు అభి ప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

పల్లెల్లోనూ నిఘా నేత్రాలు

... 5వ పేజీ తరువాయి



ఖండేపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సులభంగా పట్టుకోవడవంతోపాటు, అనవసర వివాదాలు, కొట్లాటలు, అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం ఉండదన్న ఉద్దేశంతో పోలీసులు ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రతి గ్రామంలో కీలక ప్రాంతాల్లో కనీసం నాలుగు అయినా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పలు పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. చోడవరం మండలం వెంకన్నపాలెం, రాయపురాజుపేట, నరసయ్యపేట, ఖండేపల్లి, కన్నంపాలెం పంచాయతీల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటుచేయగా, మిగిలిన పంచాయతీల్లో సైతం ఏర్పాటుకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ముందుకు వస్తున్నారు. ఖండేపల్లిలో 15 సీసీ కెమెరాలను కీలక ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. వెంకన్నపాలెంలో 12 సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయి. చోడవరం శివారు గాంధీగ్రామంలో 10 కెమెరాలు బిగించారు.

ఉత్సవాలకు అనుమతులతో లింకు

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు చాలా రోజులుగా నాయకులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పెద్దగా స్పందన రాలేదు. దీంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు సరికొత్త ఆలోచన చేశారు. గ్రామాల్లో ఏటా అమ్మవార్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తుంటారు. భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే ఇందుకోసం పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. సీసీ కెమెరాల ఏర్పాటు ఆలోచనను ఈ సందర్భంగా అమలు చేయడం ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తేనే.. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇస్తామంటూ మెలిక పెట్టారు. దీనితో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి నాయకులు ముందుకు వస్తున్నారు.

పేటలో అక్రమ లేఅవుట్లు

... 5వ పేజీ తరువాయి

అందలేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. కానీ లేఅవుట్‌లో పనులు మాత్రం జరుగుతుండడం విశేషం. లేఅవుట్ వేస్తున్న వారికి రాజకీయ నాయకుల అండ ఉందన్న సమాచారంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఈఓపీఆర్డీని సీహెచ్.చంద్రశేఖర్‌ను వివరణ కోరగా... వెంటనే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏఎంసీ వైద్యులకు పదోన్నతులు

... 5వ పేజీ తరువాయి

శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. జనరల్ సర్జరీ విభా గానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.మన్మథరావును మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు వీరిలో ఇద్దరు వైద్యులు ఆయా పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి చూపడంలేదని సమాచారం.

కేజీహెచ్‌పై సందిగ్ధం

కాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టు ను ప్రభుత్వం భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా డాక్టర్ శివానంద వ్యవహరిస్తున్నా రు. తాజాగా పదోన్నతులు పొందిన ఇద్దరితో పాటు మరో ఇద్దరు సీనియర్ వైద్యులు ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగించారు. అయితే వారికి మరోచోట అవకాశాలు లభించాయి.

అభివృద్ధికి నోచుకోని అల్లూరి పార్కు

... 5వ పేజీ తరువాయి



నడక మార్గంలో లేచిపోయిన టైల్స్

నిర్మాణం, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఇతర మరమ్మతు పనులు చేయిస్తామని చెప్పారు. ఇది జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నది.ఇంతరకు పనులు చేపట లేదు. పార్కులో పర్యాటకులు సేద తీరే నాలుగు పగోడాలు పూర్తిగా శిథిలమై అధ్వానంగా వున్నాయి. నడక మార్గంలో పలుచోట్ల టైల్స్ లేచిపోయాయి. అల్లూరి, గంటందొరసమాధులున్న మందిరం శ్లాబ్ నుంచి తరచూ పెచ్చులు ఊడిపడుతు న్నాయి. పార్కు ప్రహరీగోడ పలుచోట్ల దెబ్బతిన్నది. మే 7వ తేదీన అల్లూరి సీతారామరాజు వర్థంతి. కృష్ణాదేవిపేటలో అల్లూరి పార్కు అభివృద్ధికి గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని స్థానికులు, అల్లూరి అభిమానులు, పర్యాటకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా ముగిసిన కొత్త అమావాస్య జాతర

- నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు
- అమ్మవారి దర్శనానికి గంటలు తరబడి క్యూలో నిరీక్షణ
- కన్నులపండువగా నెల పండుగ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతి గాంచిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఆదివారంతో ముగిసింది. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం చేపట్టడంతో ఆలయానికి విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయానికి వచ్చే మార్గాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. బాలాలయంలో అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారు నుంచే అమ్మవారి దర్శనానికి భక్తుల రాక ప్రారంభమైంది. ఆదివారం అమావాస్య కావడంతో


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


బాలాలయంలో కిక్కిరిసిపోయిన భక్తులు

భక్తులు మరింతగా హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. బాలాలయం, ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోవడంతో సాధారణ దర్శన భక్తులు నూకాంబిక ఆలయం రోడ్డులో రజక కాలనీ వరకు క్యూ కట్టారు. అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులకు చల్లటి మంచినీరు, మజ్జిగను అందజేశారు. పిల్లలకు పాలు కూడా పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆలయానికి భక్తుల తాకిడి మరింత పెరిగింది. ఆలయ ఆవరణలోని క్యాటేజిలన్నీ నిండిపోవడంతో భక్తులు పూల్‌బాగ్, మరిడిమాంబ ఆలయ పరిసరాల్లోని తోటల్లో అమ్మవారికి కోళ్లతో మొక్కులు మొక్కుకున్నారు. అనంతరం వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టారు.

ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కళకళలాడాయి. ఉత్సవ ప్రత్యేకాధికారిణి కె.శోభారాణి, ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్ల వద్ద పర్యవేక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం నాలుగు గంటలు దాటినా ఆలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో అమ్మవారికి అమావాస్య పూజలు నిర్వహించడంలో భాగంగా ఆలయాన్ని మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం పునర్దర్శనం కల్పించనున్నట్టు ఈవో రాంబాబు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు శేఖరం, రషీద్, పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.


అమ్మవారి దర్శనానికి రహదారిపై చాంతాడంత క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు

మలుపుల్లో అడ్డదిడ్డంగా వాహనాలు

ఎదురెదురు వాహనాలు కనిపించక ఇబ్బందులు

భయాందోళనలో వాహన చోదకులు, ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. వాహనాలను ఎక్కడబడితే అక్కడ నిలిపివేయడం, చాలా చోట్ల మలుపుల్లో ఉంచడంతో ప్రజలు, ప్రయాణికులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ప్రధానంగా ఎన్టీఆర్ స్టేడియం జంక్షన్‌లోని రావుగోపాలరావు కళాక్షేత్రానికి వెళ్లే మార్గంలో మలుపు కనబడకుండా వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఎన్టీఆర్ వైద్యాలయానికి వెళ్లే రోడ్డులో కూడా మలుపులు ఉన్న చోట వాహనాలు నిలుపుదల చేయడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనాలను తప్పించుకునేందుకు చోదకులు అవస్థలు పడుతున్నారు.

ఎన్టీఆర్ స్టేడియం జంక్షన్ నుంచి రావుగోపాలరావు కళాక్షేత్రం, కూరగాయల మార్కెట్, విద్యా సంస్థలు ఉన్నాయి. అయితే మలుపులో వాహనాలను అడ్డుగా నిలిపివేస్తుండడంతో రావుగోపాలరావు కళాక్షేత్రం నుంచి స్టేడియం మీదుగా ఎన్టీఆర్ జంక్షన్‌కు వెళ్లే వాహన చోదకులకు ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ నుంచి డీసీఎంఎస్ కార్యాలయం వైపు వచ్చే వాహనాలు



ఎన్టీఆర్ జంక్షన్ మలుపులో నిలిపివేసిన వాహనాలు.. రోడ్డుపై వాహనం పార్కింగ్ చేయడంతో కనిపించని మలుపు

కనిపించక ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. గత వారం రావుగోపాలరావు కళాక్షేత్రానికి వెళ్లే జంక్షన్‌లోని కల్వర్టుపై మలుపులో వాహనం ఉండడం వల్ల రావుగోపాలరావు కళాక్షేత్రం రోడ్డులో నుంచి స్టేడియం వైపునకు వస్తున్న ఓ కారు, అదే సమయంలో విజయనగరం నుంచి కాంప్లెక్స్‌కు వెళ్తున్న బస్ తప్పించుకునే క్రమంలో ఇబ్బంది ఎదురైంది. అయితే మలుపులో తిరుగుతున్న కారును గ్రహించిన ఆర్టీసీ డ్రైవర్ కుడి వైపు ఉన్న ఖాళీ ప్రదేశం మీదుగా మళ్లించడంతో పెను ప్రమాదం తప్పింది. బస్ డ్రైవర్ అప్రమత్తంగా లేకపోతే కారు ఆర్టీసీ బస్‌ను ఢీకొని అందులో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. ఇటువంటి సంఘటనలు అడపాదడపా జరుగుతూనే ఉంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఈ పరిస్థితిని చక్కదిద్ది ప్రధాన రహదారుల్లో మలుపుల వద్ద వాహనాలు పార్కింగ్ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఆదివారం రాత్రి వేదికపై చిన్నారులు ప్రదర్శనలు ఇచ్చారు. హైద్రాబాద్‌వాసులు గరిణే సాయికుమార్, సంతోష్‌కుమార్ అనే కవల పిల్లలు ప్రదర్శించిన శివతాండవం కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని కాండ్రేగుల శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు, నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, కాండ్రేగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నాట్యం చేస్తున్న కళాకారులు

పకడ్బందీగా బీసీ గురుకులాల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష

తుమ్మపాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చి ప్రవేశపరీక్ష రాశారు. 201 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 180 మంది పరీక్షకు హాజరయ్యారని ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన సదుపాయాలు కల్పించామని ఆయన చెప్పారు.

ఘనంగా పోతురాజుబాబు పండుగ

కశింకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరకాం గ్రామంలో పోతురాజుబాబు పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి పోతురాజుబాబుకు పలు ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజుబాబును దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) పోతురాజు బాబును దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్రికెట్ టోర్నమెంటులో విజయం సాధించిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 మంది కంటి వైద్య పరీక్షలు

కొత్తూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని కూండ్రం గ్రామంలో విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ నందారపు లక్ష్మి ప్రారంభించారు. అనంతరం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవి 50 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 20 మందికి కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు వైద్య సేవలు చేరువ చేయాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామని సర్పంచ్ లక్ష్మి తెలిపారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారందరినీ శంకర్ ఫౌండేషన్ బస్ ద్వారా తీసుకువెళ్లి, ఆపరేషన్ అయిన తరువాత స్వగ్రామానికి బస్సులో తీసుకువస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నందారపు సూరిబాబు, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వనికుమార్ పాల్గొన్నారు.



కంటి రోగులకు తనిఖీ చేస్తున్న వైద్యులు

టీడీపీ బలోపేతానికి మరింత కృషిచేయాలి

సబ్బవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకులు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి భరణికాన బాబూరావు సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కమిటీ అధ్యక్షుడిగా రొంగలి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఈగల్ వెంకట్, కార్యదర్శిగా ఆకుల నాగేశ్వరరావు, కార్యనిర్వాహక సభ్యులుగా సాడి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నాయకులు కెరామకృష్ణరాజు, బలిరెడ్డి నూకరాజు, కె.గోవిందు, కోట్ని తాతారావు, ఎడ్ల శ్రీనివాసరావు, రాజాన శ్రీను, వెంకటరమణమూర్తి, ముసలినాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ మానసకు సత్కారం


మానసను సత్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో 975 ర్యాంకు సాధించిన రావాడ సాయిమోహిని మానసను ఆదివారం ఘనంగా సత్కరించారు. చినబాబుకాలనీలో డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీపార్వతి ర్యాంకర్ మానసను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, కాండ్రేగుల వెంకటరమణ, యల్లపు సూరిఅప్పారావు, పెంటకోట ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాఠశాలలో కలుసుకున్న 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

సబ్బవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 23 ఏళ్ల తరువాత ఇక్కడ కలుసుకుని ఒకరినొక్కరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రతి ఏడాది కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు జి.శంకర్, వి.తాతారావు, పల్ల చిన్నారావు, నగేశ్, ఎస్.సంతోశ్, శెట్టి శివలక్ష్మీ, సూర్యకళ, చంద్రకళ పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

కశింకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు జరగనున్నాయని గ్రంథాలయాధికారి కె.జగన్నాథం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు కథలు, నీతి కథలు చెప్పడంతో పాటు పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, కాగితాలతో బొమ్మలు తయారు చేయడం, జనరల్ నాలెడ్జ్, క్విజ్, డ్యాన్స్, ఆటలు తదితర అంశాలు నేర్పిస్తామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయంలో విజ్ఞాన శిక్షణ తరగతులకు పంపాలని కోరారు.

అక్రమ నిర్మాణం తొలగించాలి

పరవాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో రద్దు చేసిన ప్లాట్‌లో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కార్మిక నాయకుడు బొద్దపు చిన్నారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇదివరకే ఈ ప్లాట్‌ను లోకాయుక్త కోర్టు రద్దు చేసిందని చెప్పారు. రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు కుమ్మక్కై అక్రమ నిర్మాణానికి పూనుకున్నారని ఆయన ఆరోపించారు. నిర్మాణ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చిన్నారావు తెలిపారు.

విజయగణపతి ఆలయ వార్షికోత్సవం


పూజలు అందుకున్న విజయగణపతిస్వామి

లంకెలపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలిలో విజయ గణపతి స్వామి ఆలయం పదో వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త చెలపరెడ్డి రామారావు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు శ్రీలక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి, వెండి కవచధారణ, ప్రత్యేక హారతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెట్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

సబ్బవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొటివాడ సూరపురాజ్ చెరువులో నేరేడు చెట్లు కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ నియోజకవర్గం నేత గండి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నాయకులు, ఆయకట్టు రైతులుతో ఈ చెట్లను పరిశీలించారు. కొన్ని రోజుల క్రితం చెరువులో ఆరు ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.20 లక్షల విలువ చేసే నేరుడు, మద్ది తదితర వృక్షాలను అక్రమంగా నరికేసి అమ్ముకున్నారని ఆరోపించారు. దీనిపై రైతులు, గ్రామ పెద్దలు తహసీల్దార్, కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.దుర్గాప్రసాద్, నేతలు వి.చిన అప్పలనాయుడు, ఎల్.కుమార్, రైతులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

ఘనంగా నూకాలమ్మతల్లి అనుపోత్సవం

సబ్బవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అసకపల్లి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం నూకాలమ్మతల్లి అనుపోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ప్రజలు అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీలు, బాణసంచా పేలుళ్లతో అమ్మవారి ఊరేగింపు జరిగింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ కర్రి నరసింగరావు, గ్రామ పెద్దలు సత్కరించారు. రాత్రి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పారావు, నాయకులు ఇందలి వెంకటరమణ, బి.అప్పారావు, కర్రి కనకరాజు, బిసాయినాథరావు, ఎస్.రాము, జి.అప్పారావు, సత్యనారాయణ, ఈపు అప్పలరాజు, బి.దేముడుబాబు, జి.కుమారస్వామి, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

తాకాశి వీధిలో అన్నసమారాధన


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి రామకృష్ణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తాకాశివీధిలోని నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ఆలయానికి వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాకాశి రాజేశ్, నాయకులు తాకాశి కన్నబాబు, తాకాశి కిశోర్, తాకాశివీధి పెద్దలు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ రాముకు టీడీపీ నేతల సత్కారం


మార్కెట్ కమిటీ చైర్మన్ రామును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కొత్తూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పచ్చికూర రామును తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. కూండ్రంలో రామును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రాముకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించి ప్రభుత్వం న్యాయం చేసిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గతంలో పార్టీ మండల అధ్యక్షుడిగా, సీనియర్ నాయకుడిగా రాము పనిచేసి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, కోన శ్రీను, మేడిశెట్టి నూకరాజు, బర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన


అనకాపల్లి పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా పట్టణంలో ఆదివారం రాత్రి మాజీ సైనికులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనకాపల్లి సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నెహ్రూచౌక్ నుంచి చిననాలుగు రోడ్ల జంక్షన్, అక్కడి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా నెహ్రూచౌక్‌కు ప్రదర్శన సాగింది. పహల్గాం అమరవీరులకు నివాళి.. ఉగ్రవాదం నశించాలి.. పాకిస్తాన్ డౌన్ డౌన్.. భారతమాతకు జై.. అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎ.హనుమంతరావు, శరకణం శివశంకర్, గోవిందరావు, వరప్రసాద్, సన్యాసిరాజు, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రతినిధి కొణతాల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దుశ్చర్యపై నిరసన ర్యాలీ


గొల్లలపాలెం శివలోహిత డ్రీమ్ వ్యాలీలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ప్రజలు

సబ్బవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపాలెం దరి శివలోహిత డ్రీమ్ వ్యాలీ ప్రజలు ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. అనంతరం వీరయ్య చౌదరీ, బాక్సర్ శ్రీను, దుప్పల భానుదేవ్ తదితరులు మాట్లాడుతూ ఉగ్రమూకలను తుదముట్టించేందుకు ప్రధాని మోదీకి అంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. హిందువులు ఐక్యంగా ఉంటే పాకిస్థాన్ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. ఇటువంటి దుశ్చర్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, తిరుమలరావు, బగాది రవి, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ: పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో ఆదివారం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.సన్యాసినాయుడు, కె.నాయుడు, బి.శ్రీను, బి.లచ్చిబాబు పాల్గొన్నారు.